ఏడాదిలో రూ.వెయ్యి కోట్లు తీసుకొచ్చా

• పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

సాక్షి, పెద్దపల్లి: ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోనే నియోజకవర్గానికి వివిధ అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.వెయ్యి కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు పెద్దపల్లి ఎమ్మెల్యే చింత కుంట విజయరమరావు అన్నారు. పెద్దపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దపల్లి ప్రజల చిరకాల స్వప్నం పెద్దపల్లిలో ఆర్టీసీ బస్ డిపో మంజూరు చేయించానని తెలిపారు. పత్తిపాక రిజర్వాయర్ డీపీఆర్ పనుల కోసం రూ.5కోట్లు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాలుగేళ్లలో పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసి జిల్లాలోని చివరి ఆయకట్టు భూములకు సాగు నీరం



అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

దిస్తామని హామీ ఇచ్చారు. రానున్న నాలుగేళ్లలో పెద్దపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అభివృద్ధి పథంలో ముందు వరసలో నిలుపుతానన్నారు. సీఎం పాల్గొన్న యువ వికాసం విజయోత్సవ సభ విజయవంతం చేసినందుకు జిల్లాలోని ప్రజలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దమ్మతల్లి దీవెనలు ఉండాలి

కాల్వశ్రీరాంపూర్: పెద్దమ్మతల్లి దీవెనలతో ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ఎమ్మెల్యే విజయరమణారావు ఆకాంక్షించారు. పందిల్లలో శుక్రవారం పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. వేద పడింతులు నిట్టూరి సతీశ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి, కూనారం, మల్యాల, పందిల్ల, వెన్నంపల్లితోపాటు కాల్వశ్రీరాంపూర్‌లో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఎమ్మెల్యే విజయరమణారావు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తహసీల్దార్ ఎండీ వకీల్, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీలు లంక సదయ్య, వంగళ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వనదర్శిని పేరిట అటవీప్రాంతం సందర్శన



మాట్లాడుతున్న ఎఫ్ఆర్‌వో నాగయ్య

రామగుండం: అడవుల పెంపకంతో అనేక ప్రయోజనాలు ఉంటాయని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ నాగయ్య అన్నారు. పలువురు విద్యార్థులతో కలిసి ఆయన శుక్రవారం వనదర్శిని పేరిట అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. పర్యావరణ పరిరక్షణ, అటవీ ఉత్పత్తులు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సయ్యద్ రహ్మతుల్లా, అధికారులు సతీశ్‌కుమార్, మీర్జా ఇర్షద్‌బేగ్, మేఘరాజ్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థికంగా ఎదగాలి



మొక్కలు నాటిస్తున్న ఏవో

ఎలిగేడు: రైతులు ఆయిల్‌పామ్ పంట సాగు చేసి ఆర్థికంగా ఎదగాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.ఉమాపతి సూచించారు. మండలంలోని లాలపల్లిలోని ఏలేటి అశోక్‌రెడ్డికి చెందిన 4.20 ఎకరాల పొలంలో, అన్నాడి మంజులకు చెందిన 3 ఎకరాల్లో శుక్రవారం ఆయిల్‌పామ్ మొక్కలు నాటించారు. రైతులు ప్రభుత్వం అందించే సబ్సిడీ సద్వినియోగం చేసుకుని ఆయిల్‌పామ్ సాగు చేయాలని కోరారు. ఏవో ఉమాపతి, ఏఈవో సురేశ్, ఆయిల్ పామ్ కంపెనీ అధికారి అభిలాష్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ముత్తారం: మండలంలోని పోతారం గ్రామంలో మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి శుక్రవారం కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. మంథని నియోజవర్గ అభివృద్ధికి మంత్రి అహర్నిషలు కృషి చేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, నాయకులు చెల్కల జితేందర్‌యాదవ్, గ్రామ అధ్యక్షుడు నర్ర మల్లయ్య అన్నారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బక్కతట్ల వినీత్, గ్రామశాఖ యూత్ అధ్యక్షుడు నెత్తెట్ల కిరణ్, మాజీ ఎంపీటీసీలు భారతలక్ష్మి, కొమురయ్య, బండ సమ్మయ్య, చెల్కల కాంతయ్య, ఓదెలు, బత్తుల రాజయ్య, మల్లయ్య, మల్లేశ్, కోటగిరి శ్రీశైలం, చింతల అనిల్, ఒడ్నాల సమ్మయ్య, ఇట్టం గట్టయ్య, వెంకటేశ్, రమేశ్, శ్రావణ్, ఒల్లెపు మొగిలి, కుమార్ నర్ర రాజేశ్, జంగిటి తిరుపతి, మల్యాల వెంకట్రాజం, బండ ఓదెలు, పులిగంటి రాజేశం, కట్ల కుమార్, రాఘవులు, తూడూరి చంద్రమౌళి, సాదుల రాజయ్య, నాంసాని రాజయ్య పాల్గొన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం



బహుమతులు అందిస్తున్న ఎంఈవో ఓదెలు

ముత్తారం: మండలంలోని విద్యావనరుల కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన దివ్యాంగుల క్రీడాపోటీల్లో విజేతలకు శుక్రవారం ఎంఈవో ఓదెలు బహుమతులు అందించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం నిట్టూరు జెడ్పీహైస్కూల్ పాఠశాల విద్యార్థులు సంధ్య, రూపప్రియ, సంకీర్తన, వెన్నెల జిల్లాస్థాయిలో కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు సీఆర్‌పీ సుధాకర్ తెలిపారు. వీరు హైదరాబాద్‌లో శనివారం నుంచి మొదలయ్యే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం, రేకుర్తి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో సుమారు 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపాలు ఉన్న 40 మందిని గుర్తించి కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం సెక్రటరీ ఎల్లప్ప, అధ్యక్షుడు మల్లికార్జున్, కాంగ్రెస్ 14వ డివిజన్ అధ్యక్షుడు బూర్ల శ్రీనివాస్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీవో పారిజాతం పాల్గొన్నారు.

సన్నరకాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వండి

ధర్మారం: రైతులు యాసంగిలో సైతం సన్నరకం వరిసాగుకు ప్రాధాన్యం ఇస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్‌కుమార్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని వరినార్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు యాసంగిలో సన్నరకం వేస్తే దిగుబడులు రావనే అపోహలు వీడాలని సూచించారు. ప్రస్తుతం సబ్సిడీపై మొక్కజొన్న, పొద్దు తిరుగుడు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

పాలకుర్తి: ప్రస్తుత యాసంగి సీజన్‌లో రైతులు స్వల్పకాలిక సన్నరకాల వరిసాగు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్



వరినారు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

సూచించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వరి నారుమళ్లను శుక్రవారం సందర్శించి రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు. ఆయిల్ పాం, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న విత్తనాలను రాయితీపై అందిస్తున్నట్లు ఏవో పేర్కొన్నారు.

ప్రభుత్వ విద్యార్థుల విజ్ఞానయాత్ర



కంపెనీ సందర్శనలో గుంజపడుగు విద్యార్థులు

మంథని: మండలంలోని గుంజపడుగు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన 40మంది విద్యార్థులు శుక్రవారం విజ్ఞానయాత్రకు వెళ్లారు. హైదరాబాద్‌లోని విమాన విడిభాగాలు తయారు చేసే కంపెనీ, రక్షణ రంగంలో ఉపయోగించే మిసైల్ విడిభాగాలు తయారు చేసే కంప్రోటెక్ కంపెనీ, ఇయర్ బడ్స్ తయారు చేసే ప్రఖ్యాత కంపెనీలను సందర్శించారు. మండల విద్యాధికారి దాసరి లక్ష్మి, ఉపాధ్యాయులు కర్రు సురేశ్, కల్వల స్వామి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



రామగుండం: పొట్యాల హైస్కూల్ విద్యార్థులు

రామగుండం: అంతర్గాం మండల పరిధి పొట్యాల జెడ్పీహైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఇటీవల జరిగిన కరీంనగర్ ఉమ్మడి జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సంగీత తెలిపారు. ఇందులో జి.స్నేహిత, ఎం.ఐశ్వర్య, కె.హరినాథ్ డిసెంబర్ 7–9వ తేదీల్లో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థులను ఏఎంసీ చైర్మన్ ఎం.విజయలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ ఆర్.తిరుపతి, హెచ్‌ఎం శ్రీనివాస్, రాంచందర్, పోచయ్య, లక్ష్మయ్య, శ్రీధర్‌రెడ్డి అభినందించారు.



జూలపల్లి: ఎంపికైన విద్యార్థి హరికృష్ణ (మధ్యలో)

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న కె.హరికృష్ణ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. గత నెల 27న చింతకుంట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్–17 పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో ఆర్మూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పాల్గొనేందుకు అర్హత సాధించాడు. రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన హరికృష్ణను ప్రధానోపాధ్యాయులు డి.రమేశ్, పీడీ మహేందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం వినియోగించుకోండి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామమైన యైటింక్లయిన్‌కాలనీ అల్లూరు గ్రామంలో శనివారం ఆర్జీ–2 సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరం వినియోగించుకోవాలని ఆర్జీ–2 ఏరియా జీఎం వెంకటయ్య శుక్రవారం ఒక ప్రటనలో సూచించారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా అవినాష్



పెద్దపల్లిరూరల్: యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన బొంకూరి అవినాష్ భారీ మెజార్టీతో ఎన్నికయ్యారు. ఆన్‌లైన్ పద్ధతిలో ఇటీవల నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో జిల్లా అధ్యక్ష పదవికి బొంకూరి అవినాష్ పోటీ చేశారు. 7011 ఓట్ల భారీ మెజారిటీతో అవినాష్ అధ్యక్షుడిగా గెలుపొందినట్టు నిర్వాహకులు పేర్కొన్నారు.

తలసేమియా బాధిత చిన్నారుల కోసం రక్తదానం

గోదావరిఖని: తలసేమియా వ్యాధిగ్రస్తుల సహాయార్థం శుక్రవారం హెచ్‌డీఎఫ్‌సీ రామగుండం బ్రాంచ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ సీహెచ్‌శ్రీ విద్యాసాగర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వ్యాపారవేత్త, సీనియర్ బ్యాంక్ ఖాతాదారులు కోలేటి శ్రీనివాస్ హాజరై రక్తదాన శిబిరం ప్రారంభించారు. ఆపరేషన్ మేనేజర్ కుమారస్వామి, ఎన్టీపీసీ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, సంజీవ్, బ్యాంక్ సిబ్బంది, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

ఎన్నికల హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం

రామగిరి: ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2లో శుక్రవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఇటీవల కొత్తగూడెంలో జరిగిన సమావేశాల్లో పలు అంశాలపై అంగీకారం కుదిరిందన్నారు. మైనింగ్ స్టాఫ్, సూపర్‌వైజర్లు, ఈపీ ఆపరేటర్లు, ట్రేడ్‌మెన్స్ మెడికల్ అన్‌ఫిట్ అయితే తగిన జాబ్ ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు. మైనింగ్ స్టాఫ్, సూపర్‌వైజర్లు ఒప్పుకున్నారని, మిగతా వారి విషయంపై త్వరలో సీఅండ్ఎండీ సమక్షంలో జరిగే చర్చల్లో పరిష్కరిస్తామని చెప్పారని తెలిపారు. డిస్మిస్ అయిన జేఎంఈటీ తిరిగి తీసుకోవడానికి యాజమాన్యం అంగీకారం తెలిపిందని, మిగతా డిస్మిస్ కార్మికుల విషయంలో కమిటీ వేసి పరిష్కారస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. బ్రాంచ్ సెక్రటరీ రామచంద్రారెడ్డి, నాయకులు రావు, గంగాధర్, ధర్మయ్య, ప్రభాకర్, ఓసీపీ–2 మైన్ పిట్ కమిటీ సభ్యులు, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

సెయింట్ క్లేర్‌లో వార్షిక వేడుకలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని సెయింట్ క్లేర్ హైస్కూల్‌లో శుక్రవారం వార్షిక వేడుకలు ప్రధానోపాధ్యాయుడు డోమినిక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా రెవరెండ్ ఫ్రాన్సిస్ ఐ సంధూరాజా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫ్ టాస్క్ డైరెక్టర్ వీకే స్వామి, అంబ్రోస్, సెక్రడ్ హార్ట్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మారియా పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఎల్లమ్మ ఆలయంలో దొంగతనం

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని చిన్నకల్వల రేణుక ఎల్లమ్మ ఆలయంలో గురువారం రాత్రి దొంగతనం జరిగింది. గౌడ సంఘం అధ్యక్షుడు సత్తయ్య, మాజీ సర్పంచ్ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం ఆలయం శుభ్రం చేయడానికి స్వీపర్ రాగా తాళం పగలకొట్టి ఉంది. వస్తువులు అన్నీ చిందరవందరగా ఉన్నాయి. అమ్మవారి మెడలో ఉన్న అర్ధతులం బంగారు పుస్తెల తాడు, 5 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు నిర్ధారించడంతో పాటు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

• పీడీఎస్ బియ్యం స్వాధీనం

గోదావరిఖని: వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పెద్దపల్లి టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అర్ధరాత్రి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోదావరిఖని నుంచి రేషన్‌బియ్యం అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ రమేశ్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక గంగానగర్ వద్ద తనిఖీ నిర్వహిస్తుండగా ఈ ఆటో పట్టుబడినట్లు పేర్కొన్నారు. మంచిర్యాల పట్టణం ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన టి.దర్శన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆటోను స్వాధీనం చేసుకుని విచారణ కోసం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో అప్పగించినట్లు పేర్కొన్నారు.

• లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదు

మంథని: పెద్దపల్లిలో నిర్వహించిన సభకు ప్రజలు అభిమానంతో వస్తే లేనిపోని ఆరోపణలు చేస్తూ బురదజల్లడం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకు తగదని మంథని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, నాయకులు నూకల బానయ్య, నర్సింగారావు, కొండా శంకర్, మంథని సత్యం, ఆకుల కిరణ్ ఉన్నారు.

• బియ్యం పట్టివేత

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీసులు శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న రెండు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి రామగిరి మండలం సుందిళ్ల గ్రామ శివారులో మంచిర్యాలకు చెందిన చింతల రాకేశ్ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రెండు క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టుకున్నారు. వ్యక్తితో పాటు ఆటోను టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

• బోర్‌వెల్ మెషీన్ సీజ్

రామగిరి: మండలంలోని బేగంపేట శివారులో అనుమతి లేకుండా బోరు వేస్తున్న మెషీన్‌ను శుక్రవారం తహసీల్దార్ రాంచందర్‌రావు, భూగర్భ జల వనరులశాఖ అధికారులు సీజ్ చేసి జరిమానా విధించారు. అనుమతి లేకుండా బోర్లు వేయొవద్దని, ఒకవేళ వేస్తే రూ.లక్ష జరిమానా విధిస్తామని తహసీల్దార్ తెలిపారు. హైడ్రాలజిస్ట్ వేణు, జియాజలిస్ట్ సుజాత ఉన్నారు.

• ఆటోల బంద్ విజయవంతం చేయండి

యైటింక్లయిన్‌కాలనీ: ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాలనీలో శనివారం చేపట్టే ఆటో, క్యాబ్‌ల బంద్ విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు అశోక్ పిలుపునిచ్చారు. శుక్రవారం కాలనీ ఆటోస్టాండ్ వద్ద ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు.

• కుక్కదాడిలో వృద్ధుడికి తీవ్రగాయాలు

ఓదెల: కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లికి చెందిన పర్వతాలు అనే వృద్ధుడిని అదే గ్రామంలో శుక్రవారం ఉదయం కుక్క కరవడంతో తీవ్రగాయాలయ్యాయి. కుడికాలుకు తీవ్రగాయం కాగా ఎడమ కాలికి స్వల్పంగా గాయాలయ్యాయి. మండలంలోని కొలనూర్ ప్రాథమిక హాస్పిటల్‌లో ప్రాథమిక చికిత్స చేసి కరీంనగర్‌కు తరలించారు.


• కరపత్రం ఆవిష్కరణ

రామగుండం: ఆటో, క్యాబ్, ట్యాక్స్ డ్రైవర్లు శనివారం నిర్వహించే బంద్ విజయవంతం చేయాలని మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు కోరారు. అంతర్గాం జంక్షన్‌లో బంద్ కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు.

• అయ్యప్పస్వాములకు అన్నదానం

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామానికి చెందిన జబ్బార్‌ఖాన్ అయ్యప్ప మాలధారణ స్వాములకు శుక్రవారం గ్రామంలోని హనుమాన్ ఆలయంలో అన్నదానం చేశారు. కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై దృష్టి



స్పీడ్ బ్రేకర్లు వేయిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

గోదావరిఖని: రోడ్డు ప్రమాదాల నియంత్రణపై గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు దృష్టిసారించారు. ఈ సందర్భంగా గంగానగర్ సమీపంలోని మిలీనియం క్వార్టర్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయించారు. వాహనాలు వేగంగా రాజీవ్ రహదారిపైకి వెళ్లకుండా కట్టడి చేసేందుకు స్పీడ్ బ్రేకర్లు దోహదపడుతాయన్నారు. స్టాపర్లను సరిచేయడం, సిగ్నల్స్ ఏర్పాటు చేయడం, రేడియం స్టిక్కర్లు అంటించారు. ఇంటి నుంచి బయలు దేరిన ప్రయాణికులు సురక్షితంగా తిరిగి ఇళ్లు చేరుకోవడమే లక్ష్యంగా డ్రైవింగ్ చేయాలని, పోలీసుల సూచనలు పాటించాలని సీఐ కోరారు.



గోదావరిఖని: జూలపల్లి నుంచి పెద్దపల్లికి వెళ్లే రోడ్డు గుంతలు ఏర్పడి ప్రమాదంగా మారింది. జూలపల్లి పెట్రోల్ బంక్ పక్కన కాకతీయ కెనాల్ దగ్గర తారుపోయి గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. నిధులు మంజూరైనప్పటికీ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలని జూలపల్లికి చెందిన పాటకుల అనిల్ కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

పటిష్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలి

గోదావరిఖని: రక్షణ పక్షోత్సవాల్లో గనులు, డిపార్ట్‌మెంట్లపై పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య ఆదేశించారు. జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 55వ రక్షణ పక్షోత్సవాల సందర్భంగా తనిఖీల కమిటీలు ఏరియాకు వస్తున్న నేపథ్యంలో ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గనుల్లో భద్రత ప్రమాణాలు పాటించడం, ప్రమాదాలు తగ్గించడం, ఆరోగ్య భద్రతపై కమిటీలు నిశితంగా పరిశీలిస్తాయన్నారు. ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, నెహ్రూ, ఏరియా ఇంజినీర్ నరసింహారావు, ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం సంతోష్‌కుమార్, ప్రాజెక్ట్ ఇంజినీర్ రాజాజీ, పర్సనల్ డీజీఎం అనిల్‌కుమార్, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, సివిల్ డీజీఎం ధనుంజయ్, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, స్టోర్స్ డీజీఎం సుజన్ మెహ్రా, ఫైనాన్స్ డీజీఎం వెంకటరామచంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం బండి వెంకటయ్య

అంబేడ్కర్ విగ్రహానికి నివాళి

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియాలో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్జీ–1 పర్సనల్ డీజీఎం కిరణ్‌బాబు, ఫారెస్ట్ డీజీఎం బానోతు కర్ణ, సంఘాల నాయకులు జనగామ నర్సయ్య, గంగారపు లింగమూరి ఈర్ల రాజేశ్, యాట ఓదెలు, గడ్డం శంకర్, రమేశ్, రాజేందర్, రమేశ్ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న పర్సనల్ డీజీఎం కిరణ్‌బాబు

పోరాటాలతోనే కార్మిక సమస్యలు పరిష్కారం

గోదావరిఖని: పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. స్థానిక శ్రామిక భవన్‌లో శుక్రవారం జిల్లాస్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో పర్యటించిన సీఎం కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలు విస్మరించారన్నారు. జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి, ఉపాధ్యక్షులు ఎస్.బిక్షపతి, మెండె శ్రీనివాస్, డి.కొమరయ్య, జి.జ్యోతి, రామాచారి, ఎస్.రవీందర్ పాల్గొన్నారు.



నివాళి అస్తున్న నాయకులు

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం

కమాన్‌పూర్: ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటున్న హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయమని ఎస్సై కొట్టె ప్రసాద్ అన్నారు. మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన గుర్రాల అర్జున్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. కాగా సభ్యులు జమ చేసిన రూ.73వేలు శుక్రవారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డితో కలిసి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. యువత ఇలాంటి కార్యక్రమాలు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నారగోని సతీశ్, విజయ్, ఇనగంటి రోహిత్‌రావు, జకీర్, శ్రీనివాస్, సూరజ్ పాల్గొన్నారు.



సాయం అందజేస్తున్న ఎస్సై కొట్టె ప్రసాద్



గోదావరిఖని: నివాళి అర్పిస్తున్న నాయకులు



పెద్దపల్లిరూరల్: నివాళి అర్పిస్తున్న నాయకులు

బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి

పెద్దపల్లిరూరల్/గోదావరిఖని/పాలకుర్తి/సుల్తానాబాద్/యైటింక్లయిన్‌కాలనీ/కమాన్‌పూర్/సుల్తానాబాద్‌రూరల్/రామగిరి/గోదావరిఖనిటౌన్/ఓదెల/రామగుండ/ఎలిగేడు/జూలపల్లి/ధర్మారం: అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఆయన విగ్రహాలకు నివాళి అర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ పని చేయాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు.



రామగుండం: పూలమాల వేస్తున్న కార్పొరేటర్ లత